సాక్షి పెద్దపల్లి

శుక్రవారం । 27 । జనవరి । 2023



కలెక్టరేట్ ఆవరణలో చిన్నారుల సాంస్కృతిక ప్రదర్శన



మాట్లాడుతున్న కలెక్టర్ సంగీత

న్యూస్‌రీల్

ఉద్యోగుల పిల్లలకు 'చైల్డ్‌కేర్‌సెంటర్'



చైల్డ్‌కేర్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న కలెక్టర్

పెద్దపల్లిరూరల్: కలెక్టరేట్‌లోని పలు ప్రభుత్వ శాఖల కార్యాలయాల్లో పనిచేసే అధికారులు, ఉద్యోగ సిబ్బంది పిల్లల కోసం కలెక్టర్ సంగీత ఏర్పాటు చేయించిన చైల్డ్‌కేర్‌సెంటర్‌ను ఆమె గురువారం ప్రారంభించారు. అన్ని వసతులతో ఏర్పాటు చేసిన ఈ సెంటర్ గోడలపై ఆకర్షణీయమైన బొమ్మలు వేయించారు. చిన్నారులకూ ర్పుని చదువుకునేందుకు.. ఆడుకునేందుకు అవసరమైన సామగ్రిని అందుబాటులో ఉంచారు.

పెద్దపల్లికి చేరిన సైకిల్‌యాత్ర



పెద్దపల్లి బస్టాండ్ వద్ద సైకిల్ యాత్రికులు

పెద్దపల్లిరూరల్: గణతంత్ర వేడుక పురస్కరించుకుని కరీంనగర్‌కు చెందిన ఏజే ఫెడల్, సైక్లింగ్ జాబ్ వారి ఆధ్వర్యంలో 74 కిలోమీటర్ల సైకిల్‌యాత్ర గురువారం పెద్దపల్లికి చేరింది. గణతంత్ర ప్రత్యేకతను చాటిచెప్పేందుకే సైకిల్ యాత్ర చేపట్టామని సైకిలిస్టు ఎస్ఆర్. శేఖర్ తెలిపారు. కరీంనగర్ నుంచి పెద్దపల్లి.. తిరిగి కరీంనగర్ వరకు సైకిల్‌యాత్ర సాగిందన్నారు. సభ్యులు జయంత్, అవినాశ్, నూతన్, పర్శరాం, రోహిత్, విక్కీ, అభిషేక్, రవీందర్, సంతోష్, సంపత్ తదితరులున్నారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై పోరాటం



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న రాజ్‌ఠాగూర్

గోదావరిఖని: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలపై పోరాటాలకు శ్రీకారం చుట్టినట్లు కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ఎంఎస్.రాజ్‌ఠాగూర్ తెలిపారు. గురువారం స్థానిక విఠల్‌నగర్‌లో హాథ్‌సే హాథ్ జోడో అభియాన్ యాత్ర కార్యక్రమాన్ని ప్రారంభించారు. జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఇంటింటికీ వెళ్లి కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు చేసిన అభివృద్ధి పనులు, రాహుల్‌గాంధీ భారత్ జోడో యాత్రపై ప్రజలకు వివరిస్తామన్నారు. బీజేపీ, బీఆర్ఎస్ ప్రజావ్యతిరేక, కార్పొరేట్ అనుకూల విధానాలపై పార్టీ విడుదల చేసిన పోస్టర్లను ప్రజలకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పార్టీ కార్పొరేషన్ అధ్యక్షుడు బొంతల రాజేశ్, సీనియర్ నాయకులు మాదరబోయిన రవికుమార్, దొంతుల లింగం, కార్పొరేటర్లు ఎండీ.ముస్తఫా, గాధం విజయానంద్, పాతిపెల్లి రవియాదవ్, చుక్కల శ్రీనివాస్, యుగేందర్, గట్ల రమేష్, నజీముద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటికీ సంక్షేమం..

74వ గణతంత్ర వేడుకల్లో కలెక్టర్ సంగీత వెల్లడి

- అంధత్వ రహిత జిల్లా కోసమే 'కంటివెలుగు'
- దళితకుటుంబాల్లో దళితబంధు వెలుగులు
- కార్పొరేట్ విద్య అందించేందుకు 'మన ఊరు–మనబడి'
- అందరి సహకారం, సమన్వయంతో అభివృద్ధికి బాటలు







సాక్షి, పెద్దపల్లి: ప్రభుత్వం చేపడుతున్న పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల ద్వారా జిల్లాలోని ప్రతి ఇంటికీ సంక్షేమ ఫలాలు అందుతున్నాయని కలెక్టర్ సంగీత స్పష్టం చేశారు. నూతన కలెక్టరేట్‌లో మొదటి సారిగా నిర్వహించిన 74వ గణతంత్ర వేడుకల్లో భాగంగా గురువారం జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం పోలీసుల నుంచి గౌరవవందనం స్వీకరించారు. అనంతరం జిల్లా ప్రగతి నివేదికను చదివి వినిపించారు. మంత్రి కొప్పుల ఈశ్వర్, ఎమ్మెల్యేలు, జెడ్పీ చైర్మన్, ఇతర ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు, పోలీస్‌శాఖల సహకారం, సమన్వయంతో జిల్లా అభివృద్ధి బాటలో ప్రయాణిస్తోందని వివరించారు.



జెండావిష్కరిస్తున్న కలెక్టర్ సంగీత





అంధత్వరహిత జిల్లా కోసం..

జిల్లాలో కంటి సమస్యలతో బాధపడుతున్న వారికి ఉచితంగా పరీక్షలు నిర్వహించేందుకు కంటివెలుగు కార్యక్రమాన్ని జనవరి 19న ప్రారంభించినట్లు తెలిపారు. ఇందుకోసం 34 వైద్య బృందాలను ఏర్పాటు చేసి 18 ఏళ్లపైబడిన వారందరికీ ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి అద్దాలు, మందులు అందిస్తున్నామని వెల్లడించారు. ఈ కార్యక్రమం ద్వారా జిల్లాలో సుమారు 4.50 లక్షల మందికి కంటి పరీక్షలు నిర్వహించడం లక్ష్యంగా పెట్టుకున్నట్లు పేర్కొన్నారు.

అందుబాటులోకి మెరుగైన వైద్యం..

రామగుండంలో మెడికల్ కళాశాల ఏర్పాటు చేసుకుని.. ఈ ఏడాది ఎంబీబీఎస్ మొదటి సంవత్సరం తరగతులు ప్రారంభించుకున్నామని తెలిపారు. ఇటీవల ధర్మారం మండలంలోని నందిమేడారంలో రూ.7.5 కోట్లతో 30 పడకల ఆసుపత్రి పనులకు శంకుస్థాపన చేసుకున్నామని పేర్కొన్నారు. ప్రభుత్వం 5 పడకల డయాలసిస్ సెంటర్ మంజూరు చేసిందని, ఏంఓయూ పూర్తి చేశామని, త్వరలో జిల్లాకేంద్రంలో డయాలసిస్ సేవలను ప్రజలకు అందుబాటులోకి తెస్తామని వివరించారు. మంథని ఆసుపత్రిలో బ్లడ్‌బ్యాంక్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

కార్పొరేట్ విద్య.. వసతులు

ప్రైవేటు కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేసే దిశగా మన ఊరు మన బడి పథకం కింద జిల్లాలో మొదటి దశలో 191 పాఠశాలలను ఎంపిక చేసుకున్నామని, వాటిలో పనులు ప్రారంభించామని తెలిపారు. ప్రతి మండలంలో రెండు పాఠశాలలను మోడల్ స్కూల్స్‌గా ఎంపిక చేసి అభివృద్ధి పనులు పూర్తి చేసి త్వరలో ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు వివరించారు. జిల్లాలో ఉన్న 361 ప్రాథమిక పాఠశాలలను 36 క్లస్టర్లుగా విభజించి విద్యార్థుల్లో కనీస అభ్యాసన విద్యా ప్రమాణాలు పెంచే దిశగా ఆగస్టు నుంచి తొలిమెట్టు కార్యక్రమం చేపట్టామని వెల్లడించారు. తద్వారా విద్యార్థుల కనీస అభ్యాసన సామర్థ్యం 19 శాతం నుంచి డిసెంబర్ చివరివరకు 52 శాతానికి పెరిగిందని హర్షం వ్యక్తం చేశారు.

దళిత బంధుతో వెలుగులు

దళితులను ఆర్థికంగా అభివృద్ధి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన దళితబంధు పథకం కింద జిల్లాలోని నాలుగు నియోజకవర్గాల పరిధిలో 259 మంది లబ్ధిదారులను ఎంపిక చేసి రూ.10 లక్షల యూనిట్లను మంజూరు చేశామన్నారు.

గ్రామీణాభివృద్ధి శాఖ

జిల్లాలో చేపట్టిన స్వచ్ఛ కార్యక్రమాల ఫలితంగా స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ్–2023లో భాగంగా ఓడీఎఫ్ ప్లస్‌లో సాధించిన ప్రగతి ఆధారంగా 4 స్టార్ క్యాటగిరీలో జాతీయస్థాయిలో జిల్లా 3వ స్థానంలో నిలిచిందని తెలిపారు.

ఆకట్టుకున్న నృత్యప్రదర్శనలు

పెద్దపల్లిరూరల్: రిపబ్లిక్‌డే సందర్భంగా విద్యార్థుల నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. దిల్‌హే ఇండియా పాటపై స్థానిక మహాత్మజ్యోతిబాపూలే పాఠశాల విద్యార్థినుల ప్రదర్శన ప్రథమ బహుమతి దక్కించుకుంది. చిన్నారి హర్షిని ప్రదర్శన ఆకట్టుకుంది. కలెక్టర్ సంగీత, అడిషనల్ కలెక్టర్ లక్ష్మీనారాయణ చిన్నారిని దగ్గరకు తీసుకుని అభినందించారు.

మహిళా, శిశు, దివ్యాంగుల సంక్షేమమే లక్ష్యంగా..

జిల్లాలో ఆరోగ్యలక్ష్మీ పథకం ద్వారా జిల్లాలోని 706 అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా 4,071 మంది గర్భిణులు, 4,795 మంది బాలింతలు, 7 నెలల నుంచి ఐదేళ్లలోపు వయస్సు గల 27,333 మంది పిల్లలకు పౌష్టికాహారంతోపాటు పూర్వప్రాథమిక విద్య అందిస్తున్నామని తెలిపారు. వృద్ధుల సంక్షేమానికి వద్ధాశ్రమాన్ని సుల్తానాబాద్ పట్టణంలో రెండు బ్లాక్‌లకు రూ.70 లక్షలు మంజూరు చేయించుకున్నామని, ఇటీవలే జిల్లా ఇన్‌చార్జి మంత్రితో భూమి పూజ చేయించామని తెలిపారు. కార్యక్రమంలో పెద్దపల్లి డీసీపీ రూపేష్, జెడ్పీ చైర్మెన్ పుట్ట మధు, పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి, పట్టణ ప్రముఖులు, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

జిల్లా సమాఖ్యకు రూ.26.50కోట్ల చెక్కు

జిల్లా చైతన్య సమాఖ్య జ్యోతి మహిళా సంఘానికి రూ.26కోట్ల 49 లక్షల 50వేల చెక్కును సంఘం ప్రతినిధులకు కలెక్టర్ అందించారు. బ్యాంకు లింకేజీ కింద పొందిన మొత్తాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆకాంక్షించారు. జిల్లాకు చెందిన స్వాతంత్ర్య సమరయోధులు తానిపర్తి కాంతారావు, ఎరబెల్లి రంగారావు తదితరులను కలెక్టర్ సన్మానించారు. వివిధ ప్రభుత్వ శాఖల ఆధ్వర్యంలో ఏర్పాటైన స్టాళ్లను అధికారులు సందర్శించారు. వైద్య ఆరోగ్య శాఖ, డీఆర్‌డీఏ, మహిళా, శిశు, దివ్యాంగ సంక్షేమశాఖ, చేనేత జౌళి శాఖ స్టాళ్లు ఆకట్టుకున్నాయి.



గోదావరిఖనిలో ఆకట్టుకున్న చిన్నారుల ప్రదర్శనలు



కలెక్టరేట్ ఆవరణలో జరిగిన గణతంత్ర వేడుకలకు హాజరైన అధికారులు, ప్రముఖులు



గోదావరిఖనిలో చిన్నారుల సాంస్కృతిక ప్రదర్శనలు

బదిలీల కాలం

- ఉమ్మడి జిల్లాలో ఐపీఎస్‌ల స్థానచలనం
- త్వరలో భారీగా ఐఏఎస్‌ల ట్రాన్స్‌ఫర్లు
- ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని బదిలీలు
- జాబితాలో కరీంనగర్ కలెక్టర్ దంపతులూ
- ఐపీఎస్‌ల బదిలీలపై ముందే వెల్లడించిన 'సాక్షి' కథనం

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికలకు సమయాత్తమవుతోంది. ఈ ఏడాది అంతానికి ప్రభుత్వ కాలపరిమితి ముగుస్తున్న దరిమిలా.. ఎన్నికలకు సిద్ధమవుతోంది. ఈ మేరకు కీలకమైన పరిపాలన, శాంతిభద్రతలు, రెవెన్యూ అధికారుల బదిలీలు చేపట్టింది. ఇందులో భాగంగా బుధవారం అర్ధరాత్రి.. స్పష్టంగా చెప్పాలంటే గురువారం తెల్లవారుజామున జరిగిన ఐపీఎస్‌ల బదిలీలు ఉత్కంఠకు తెరదించాయి. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఉమ్మడి జిల్లాలోని 12 నియోజకవర్గాల్లో సమర్థులైన అధికారులను నియమించాలన్న ఆలోచనను ప్రభుత్వం ఇప్పుడే అమల్లో పెట్టింది. ఇదే క్రమంలో రెండుమూడు రోజుల్లో భారీగా ఐఏఎస్‌ల బదిలీల్లోనూ ఉమ్మడి జిల్లాకు చెందిన పలువురు అధికారులు బదిలీ అవుతారని ప్రచారం సాగుతోంది.

బదిలీలపై ముందే చెప్పిన సాక్షి..

ఉమ్మడి జిల్లాలో లాంగ్‌స్టాండింగ్‌గా ఉన్న ఐపీఎస్ అధికారులు సిరిసిల్ల రాహుల్‌హెగ్డే, జగిత్యాల ఎస్పీ సింధూశర్మ బదిలీ అవుతారని, కరీంనగర్ సీపీ సత్యనారాయణ సైతం ట్రాన్స్‌ఫర్ అవుతారని కూడా 'సాక్షి' ముందే చెప్పింది. వాస్తవానికి సీపీ సత్యనారాయణ బదిలీ ఆకస్మికంగా జరిగిందేమీ కాదు. కుటుంబానికి దూరంగా తానిక్కడ పనిచేయలేకపోతున్నానని, తనను బదిలీ చేయాలని ఆయనే స్వయంగా కోరినట్లు సమాచారం. అదే సమయంలో సత్యనారాయణ ఇక్కడ హుజూరాబాద్ ఉపఎన్నికతోపాటు ఎమ్మెల్సీ జనరల్ ఎలక్షన్ నిర్వహించారు. ఈ నేపథ్యంలో పోలీసు, రెవెన్యూ ఉన్నతాధికారులు ఏదైనా జిల్లాలో జనరల్ ఎలక్షన్ నిర్వహించినా, రెండేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్నా.. మరో జనరల్ ఎలక్షన్‌కు ఉండకూడదన్న నియమం కూడా ఉంది. ఎన్నికల సమయంలో ఇబ్బంది కాకుండా ప్రభుత్వం కూడా ఆయన బదిలీవైపే మొగ్గుచూపింది.

త్వరలో ఐఏఎస్‌ల బదిలీలు..!

- అదే సమయంలో కరీంనగర్‌లో కలెక్టర్ ఆర్‌వీ కర్ణన్, జెడ్పీ సీఈవో ప్రియాంక, అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్‌లకు పదోన్నతి మీద హైదరాబాద్‌కు వెళ్లనున్నారని సమాచారం. జెడ్పీ సీఈవోకు త్వరలోనే ఐఏఎస్ హోదా రానున్న విషయం తెలిసిందే. అదనపు కలెక్టర్ జీవీ శ్యాం ప్రసాద్ లాల్, ఆర్డీవో ఆనంద్ బదిలీ కానున్నారని తెలిసింది.
- సిరిసిల్ల కలెక్టర్ అనురాగ్ జయంతి, అడిషనల్ కలెక్టర్ సత్యప్రసాద్, అడిషనల్ కలెక్టర్ ఖీమ్యా నాయక్ కాస్త అటూఇటూగా ఏడాదిలోపే విధుల్లో చేరారు. ఆర్డీవో శ్రీనివాస్ మాత్రం మూడేళ్ల కింద వచ్చారు.
- జగిత్యాల కలెక్టర్ గుగులోత్ రవి బదిలీ అయ్యే అవకాశాలున్నాయి. అలాగే ఆర్డీవో మాధురి స్థానచలనం తప్పేలా లేదు.
- పెద్దపల్లి అదనపు కలెక్టర్ లక్ష్మీనారాయణకు బదిలీ అవకాశముంది. డీసీపీ (అడ్మిన్) అఖిలేశ్, పెద్దపల్లి ఇన్‌చార్జి రూపేశ్ స్థానంలో సుధీర్ కేకన్, గైక్వాడ్ వైభవ్ వచ్చిన విషయం తెలిసిందే.

కరీంనగర్ సీపీ: సుబ్బారాయుడు



ఎల్.సుబ్బారాయుడు - సత్యనారాయణ

గతంలో కరీంనగర్‌లో ఓఎస్డీగా పనిచేసిన అనుభవం ఉంది. అడ్మినిస్ట్రేషన్, నేర పరిశోధనలో మంచి ఆఫీసర్‌గా గుర్తింపు ఉంది. గతంలో ఉమ్మడి రాష్ట్రానికి గవర్నర్‌గా పనిచేసిన నరసింహన్ సెక్యూరిటీ ఆఫీసర్‌గా పనిచేశారు. రాష్ట్ర విభజన అనంతరం ఏపీ సీఎం చంద్రబాబు వద్ద సెక్యూరిటీ ఆఫీసర్‌గా పనిచేశారు. ఇటీవల ఐపీఎస్‌ల విభజనలో తెలంగాణకు వచ్చారు. నాన్ కేడర్ ఎస్పీగా ఉన్న సమయంలో 2021 డిసెంబరులో ఐపీఎస్‌గా పదోన్నతి పొందారు. అప్పటి నుంచి డీజీపీ కార్యాలయంలో సీఐడీ విభాగంలో ఎస్పీగా విధులు నిర్వహిస్తున్నారు. తాజా బదిలీతో కరీంనగర్ పోలీస్ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టనున్నారు. ఈ స్థానంలో ఉన్న డీఐజీ సత్యనారాయణ రాచకొండ జాయింట్ కమిషనర్‌గా వెళ్లనున్నారు.

అఖిల్ మహాజన్ : సిరిసిల్ల ఎస్పీ



అఖిల్ మహాజన్ - రాహుల్ హెగ్డే

2017 ఐపీఎస్ బ్యాచ్‌కు చెందిన అఖిల్ మహాజన్ స్వస్థలం జమ్మూ–కశ్మీర్. హైదరాబాద్ జేఎన్‌టీయూలో ఇంజినీరింగ్ చదివారు. సర్దార్‌వల్లభ్ భాయ్ నేషనల్ పోలీస్ అకాడమీ (ఎస్వీఎన్‌పీసీ)లో ఐపీఎస్ శిక్షణ పొందారు. కోవిడ్ తొలివేవ్ సమయంలో 2020లో రామగుండం కమిషనరేట్‌లో ట్రైనీ ఐపీఎస్‌గా చేరారు. ఆ తరువాత కమిషనరేట్ అడ్మిన్‌గా, మంచిర్యాల డీసీపీగా బాధ్యతలు నిర్వహించారు. తాజాగా జరిగిన బదిలీల్లో సిరిసిల్ల ఎస్పీగా బాధ్యతలు చేపట్టబోతున్నారు. (ఆ స్థానంలో ఉన్న రాహుల్ హెగ్డే హైదరాబాద్ ట్రాఫిక్‌కి బదిలీ అయ్యారు) కోల్‌బెల్ట్ ప్రాంతంలో సమర్థుడైన అధికారిగా పేరు తెచ్చుకున్నారు. నేర పరిశోధన, ట్రాఫిక్ క్రమబద్ధీకరణ, గంజాయి రవాణా నిర్మూలన, భూ కబ్జాదారులకు కళ్లెం వేయడంలో అఖిల్‌కు ఈ ప్రాంతంలో మంచి మార్కులు పడ్డాయి.

రెమా రాజేశ్వరి: రామగుండం సీపీ



రెమా రాజేశ్వరి - చంద్రశేఖర్‌రెడ్డి

ప్రస్తుతం నల్లగొండ ఎస్పీగా ఉన్న రెమా రాజేశ్వరి కేరళలోని మున్నార్‌లో జన్మించారు. 2009 ఐపీఎస్ బ్యాచ్ టాపర్. విధి నిర్వహణలో నిక్కచ్చిగా ఉంటారు. ఐపీఎస్‌ల విభజన సమయంలో తెలంగాణ ఆప్షన్ ఇచ్చుకున్నారు. టెక్నాలజీ, న్యాయశాస్త్రంపై పట్టున్న అధికారి. క్షేత్రస్థాయిలో ఇన్ఫర్మేషన్ సేకరించడంలో దిట్ట. 2016లో షాద్‌నగర్‌లో గ్యాంగ్‌స్టర్ నయీం ఎన్‌కౌంటర్ సమయంలో ఆమె మహబూబ్‌నగర్ ఎస్పీగా ఉండటం గమనార్హం. సోషల్ మీడియా ఫేక్‌న్యూస్ కట్టడిలో అందెవేసిన చేయి. కోవిడ్ సమయంలోనూ డీజీపీ ఆఫీసు ఆదేశాల మేరకు టీఎస్ఎస్‌పీ బెటాలియన్ నుంచి పలు స్పెషల్ ఆపరేషన్లను పర్యవేక్షించారు. 2021 డిసెంబరులో నల్లగొండ ఎస్పీగా నియమితులయ్యారు. నేరాలను తగ్గించడంతోపాటు గంజాయి రవాణాదారులపై ఉక్కుపాదం మోపారు. త్వరలో రామగుండం సీపీగా బాధ్యతలు తీసుకుంటారు. ఆ స్థానంలో ఉన్న చంద్రశేఖర్‌రెడ్డి ఐజీగా పదోన్నతి పొందిన విషయం తెలిసిందే.

భాస్కర్: జగిత్యాల ఎస్పీ



భాస్కర్- సింధూశర్మ

హైదరాబాద్‌లో ఇంటలిజెన్స్ విభాగంలో ఎస్పీగా ఉన్న భాస్కర్‌ను ప్రభుత్వం జగిత్యాల ఎస్పీగా బదిలీ చేసింది. సూర్యాపేట జిల్లా కు చెందిన ఎగ్గిడి భాస్కర్.. 2010 గ్రూప్ అధికారి. తొలి పోస్టింగ్ గుంటూరులో, రెండో పోస్టింగ్ కామారెడ్డి డీఎస్పీగా, మూడో పోస్టింగ్ ఆసిఫాబాద్ డీఎస్పీగా, నాల్గో పోస్టింగ్ మెదక్ జిల్లా తూప్రాన్ డీఎస్పీగా, ఇంటలిజెన్సీ ఎస్పీగా పనిచేశారు. ప్రస్తుత బదిలీల్లో జగిత్యాల జిల్లాకు ఎస్పీగా వస్తున్నారు. ఆ స్థానంలో ఉన్న సింధూశర్మను ప్రభుత్వం వరంగల్‌లోని టీఎస్ఎస్‌పీ మామూనురు క్యాంపునకు బదిలీ చేసిన విషయం తెలిసిందే.

క్లుప్తంగా

గ్రామ అభివృద్ధికి రూ.లక్ష విరాళం

- స్వాతంత్య్ర సమరయోధుడి ఔదార్యం
- గణతంత్ర వేడుక సందర్భంగా చెక్కు అందజేత


చెక్కు అందిస్తున్న యెరబాటి రాజేశ్వర్ రావు

కాల్వశ్రీరాంపూర్: గణతంత్ర దినోత్సం సందర్భంగా కాల్వశ్రీరాంపూర్ గ్రామ పంచాయతీ అభివృద్ధికి అదే గ్రామానికి చెందిన స్వాతంత్య్ర సమరయోధుడు యెరబాటి రాజేశ్వర్ రావు రూ.లక్ష చెక్కును సర్పంచు ఆడెపు శ్రీదేవికి విరాళంగా అందించారు. ఈ సందర్భంగా ఎంపీపీ నూనేటి సంపత్ యాదవ్, జెడ్పీటీసీ వంగళ తిరుపతి రెడ్డి మాట్లాడుతూ వందేళ్లు ఉన్న రాజేశ్వర్ రావు గ్రామంలో శ్రీవేంకటేశ్వరస్వామి, శివాలయం, సాయిబాబా, సుబ్రహ్మణ్యస్వామి, శ్రీఆంజనేయ, సరస్వతి ఆలయాలు నిర్మించి ధార్మికత చాటుకున్నారని కొనియాడారు. రాజేశ్వర్‌రావును ప్రతిఒక్కరూ స్ఫూర్తిగా తీసుకోవాలని సర్పంచు అన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో రామ్మోహనాచారి, సూపరింటెండెంట్ సురేష్, పీఏసీఎస్ చైర్మన్ చదువు రాంచంద్రారెడ్డి, రైతు బంధు సమన్వయ సమితి మండల అధ్యక్షుడు దేవయ్య తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు ఉల్లంఘించిన వ్యక్తికి జరిమానా



చలాన్ చూపిస్తున్న అధికారులు

సుల్తానాబాద్/ఓదెల: ఎక్సైజ్ నిబంధనలు ఉల్లంఘించిన వారిపై పీడీయాక్ట్ నమోదు చేస్తామని సుల్తానాబాద్ ఎక్సైజ్ సీఐ శ్యాముల్ ఆనంద్‌రావు హెచ్చరించారు. ఓదెల గ్రామానికి చెందిన క్యాతం రమేష్ గుడుంబా, నాటు సారా అమ్మవద్దని గతంలో బైండోవర్ చేశామని, నిబంధనలు ఉల్లంఘించడంతో రూ.లక్ష జరిమానా విధించడం జరిగిందన్నారు. గుడుంబా తయారీ, విక్రయాలపై చట్టపరమైన చర్యలు తప్పవన్నారు.

యువకుడి అనుమానాస్పద మృతి


ఘటన స్థలంలో రాజు మృతదేహం


కొమ్ము రాజు(ఫైల్)

జూలపల్లి(పెద్దపల్లి): మండలంలోని వెంకట్రావుపల్లె గ్రామానికి చెందిన కొమ్ము రాజు(24)బుధవారం రాత్రి కాచాపూర్ నుంచి వడ్కాపూర్ వెళ్లే దారి పక్కన అనుమానాస్పద స్థితిలో మృతిచెందాడు. మృతుడి తండ్రి కొమ్ము రాజేశం, పోలీసుల కథనం ప్రకారం.. బుధవారం సాయంత్రం 6.30 గంటలకు రాజు తన పల్సర్ బైక్ బయటకు వెళ్లి ఎంతకు తిరిగిరాలేదు. దీంతో రాజు తమ్ముడు సతీష్, తండ్రితో కలిసి వెదుకుతుండగా, కాచాపూర్ పెట్రోల్ బంకు సమీపంలో బైక్ పక్కన మృతిచెంది ఉన్నాడు. తన కుమారుడి మృతిపై అనుమానాలు ఉన్నట్లు తండ్రి పేర్కొన్నాడు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెంకటకృష్ణ తెలిపారు.


అవార్డు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్ వి.లక్ష్మీనారాయణ

ఉత్తమ ఉద్యోగులకు అవార్డులు

ఉత్తమ సేవలకుగాను పలువురు ఉద్యోగులకు అవార్డులు వరించాయి. గురువారం గణతంత్ర దినోత్సవం సందర్భంగా కలెక్టర్ సంగీత సత్యనారాయణ ఉత్తమ ఉద్యోగులకు పురస్కారాలు అందజేశారు. – సాక్షి ఫొటోగ్రాఫర్, పెద్దపల్లి


డి.ఆదిరెడ్డి, డీఏఓ


శివయ్య, జిల్లా ఫారెస్టు అధికారి


డా. కె.శ్రీధర్, డీసీహెచ్ఓ పెద్దపల్లి


వెంకటేష్, జిల్లా లీడ్ మేనేజర్


యక్కన్న, తహసీల్దార్, సుల్తానాబాద్


వరదన్, తహసీల్దార్, ముత్తారం


విజయేందర్, డీటీ, పెద్దపల్లి


బి.సురేష్, డీటీ, పాలకుర్తి


గౌతమ్, జేఏ, కలెక్టరేట్


వాజీద్‌అలీ, జేఏ, కలెక్టరేట్


అన్వర్, కలెక్టరేట్


జి.సతీష్, సీఐ, మంథని


ఇంద్రసేనారెడ్డి, సీఐ, సుల్తానాబాద్


కె.రాజేష్, ఎస్ఐ, పెద్దపల్లి


బి.సురేందర్, హెచ్‌సీ, ముత్తారం


వి.బాబాజీ, హెచ్‌సీ, పెద్దపల్లి


ఎం.తిరుపతి, పీసీ, సుల్తానాబాద్


ఎం.రజని, పీసీ, కాల్వశ్రీరాంపూర్


రవి, జోనల్ ఇన్‌స్పెక్టర్, ఇంటెలిజెన్స్


కృపాబాయి, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ


డా.మమత, ఎంవో, కూనారం

శాంతిభద్రతల పరిరక్షణలో అప్రమత్తంగా ఉండాలి

- అడ్మిన్ డీసీపీ అఖిల్‌మహాజన్

గోదావరిఖని(రామగుండం): శాంతిభద్రతల పరిరక్షణలో పోలీస్ సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉండాలని అడ్మిన్ డీసీపీ అఖిల్‌మహాజన్ పేర్కొన్నారు. గురువారం రామగుండం పోలీస్ కమిషనరేట్ ఆవరణలో జాతీయ జెండా ఎగురవేసి సిబ్బందిచే గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, విధులు సమర్థవంతంగా నిర్వహించి, ప్రజల ఆదరాభిమానాలు చూరగొనాలన్నారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ అతిపెద్ద భారత రాజ్యాంగాన్ని రచించి దేశానికి దిశా నిర్దేశం చేశారన్నారు. రాజ్యాంగం ప్రకారం ప్రతి ఒక్కరూ విధులు నిర్వహించాలని, ఎందరో త్యాగధనుల ఫలితం గణతంత్ర దినోత్సవమన్నారు. అనంతరం గతేడాది రాష్ట్ర స్థాయిలో అతి ఉత్కృష్ట, సేవా పతకాలు పొందిన గోదావరిఖని టూటౌన్ సీఐ సయ్యద్ అఫ్జలుద్దీన్, అతి ఉత్కృష్ట సేవా పతకం సాధించిన హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాస్, సేవా పతకం సాధించిన వన్‌టౌన్ రెండో సీఐ ప్రసాద్‌రావు, ఎస్ఐ ఎండీ ఇమియొద్దీన్, ప్రసాద్‌శర్మ, ఏఎస్సై డి.రవీందర్, సత్యనారాయణ, లక్ష్మణ్, లక్ష్మీరాజాం, హెడ్ కానిస్టేబుల్ గిరి, అజీజ్‌బేగ్, కానిస్టేబుల్ రవి, రమేష్‌కు పతకాలు అందజేశారు. స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ మోహన్, గోదావరిఖని ఏసీపీ గిరిప్రసాద్, ట్రాఫిక్ ఏసీపీ బాలరాజ్, ఏఆర్ ఏసీపీ సుందర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

పెద్దపల్లి ఏఎస్సైకి సేవాపతకం

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఏఎస్సైగా విధులు నిర్వర్తిస్తున్న రవీందర్‌రావుకు సేవాపతకం లభించింది. గురువారం రిపబ్లిక్ డే సందర్భంగా రవీందర్‌రావును డీసీపీ అఖిల్‌మహాజన్ సేవాపతకంతో సత్కరించారు.


జెండా ఎగురవేస్తున్న అడ్మిన్ డీసీపీ అఖిల్‌మహాజన్

బలహీన వర్గాల మధ్య చిచ్చుపెడుతున్న ఎమ్మెల్యే

- జిల్లా పరిషత్ చైర్మన్ పుట్ట మధు

మంథని: బలహీన వర్గాల మధ్య చిచ్చుపెట్టేలా మంథని ఎమ్మెల్యే శ్రీధర్‌బాబు కుట్రలు చేస్తున్నారని, దీంతో అభివృద్ధిపై చర్చకు అవకాశం లేకుండా పోతుందని జిల్లా పరిషత్ చైర్మన్ పుట్ట మధు స్పష్టం చేశారు. గురువారం తన నివాసంలో విలేకరులతో మాట్లాడారు. ఆయా రాజకీయ పార్టీల్లో పనిచేస్తున్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలతో పాటు ఉన్నత వర్గాల్లోని బలహీన వర్గాలే ఒకరినొకరు దూషించుకుంటున్నారని, ఈ క్రమంలో ఆయా పార్టీల్లోని తమ వర్గాలే ఇబ్బందికి గురికావల్సి వస్తుందన్నారు. డబుల్ బెడ్ రూం ఇండ్ల పంపిణీ వ్యవహారంపై కాంగ్రెస్ మండలాధ్యక్షుడు తనపై ఆరోపణలు చేస్తే బీఆర్ఎస్ పార్టీకి చెందిన శ్రేణులు రాజేష్‌పై ఆరోపణలు చేశారని, అలా స్పందించడం బాధేసిందన్నారు. వయస్సులో పెద్దవారిని చిన్నవారు దూషించడం సరికాదన్నారు. డబుల్ బెడ్‌రూం ఇళ్లను పూర్తిస్థాయిలో అర్హత ఉన్నవారికే ఇచ్చామన్నారు. డ్రైవర్లు, వంట మనుషులు పేద వర్గానికి చెందిన వారు కాదా..? కాంగ్రెస్, బీజేపీల బలహీనవర్గాల నాయకులు, కార్యకర్తలు ఆలోచన చేయాలన్నారు. మనలో మనకే గొడవలు పెట్టించే కుట్రలను తిప్పికొట్టాలన్నారు. ఇక నుంచి సోషల్ మీడియాలో పోస్టులు పెట్టవద్దని, వచ్చే వాటికి స్పందించవద్దని నియోజకవర్గ బీఆర్ఎస్ శ్రేణులు, అభిమానులు గమనించాలన్నారు. సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్ ఆరెపల్లి కుమార్, ఎంపీపీ కొండ శంకర్, జెడ్పీటీసీ తగరం సుమలత, మున్సిపల్ కౌన్సిలర్ కొట్టె పద్మ రమేష్, సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు కనవేన శ్రీనివాస్, మండల అధ్యక్షుడు ఏగోళపు శంకర్ గౌడ్, రైతు బంధు అధ్యక్షుడు ఆకుల కిరణ్ తదితరులు ఉన్నారు.


మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ మధు

మంథని డివిజన్‌లో ఘనంగా గణతంత్ర వేడుకలు


వేడుకల్లో జెడ్పీ చైర్మన్, మున్సిపల్ చైర్‌పర్సన్ తదితరులు


జెండా ఎగురవేస్తున్న శ్రీధర్‌బాబు

మంథని: మంథని డివిజన్‌లో గణతంత్ర వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే శ్రీధర్‌బాబు జాతీయ జెండా ఎగురవేశారు. బీఆర్ఎస్ పార్టీ, సింగిల్ విండో కార్యాలయం వద్ద వేడుకల్లో జెడ్పీ చైర్మన్ పుట్ట మధు పాల్గొన్నారు. మంథని రెవెన్యూ డివిజనల్ కార్యాలయంలో ఆర్డీఓ వీరబ్రహ్మాచారి, తహసీల్ కార్యాలయంలో తహసీల్దార్ బండి ప్రకాష్, మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయంలో ఎంపీడీఓ రమేష్, మంథని మున్సిపాలిటీలో కమిషనర్ శారద, సింగిల్ విండో కార్యాలయంలో సీఈఓ అశోక్ జెండా ఆవిష్కరించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ పుట్ట శైలజ, బీజేపీ రాష్ట్ర నాయకుడు చంద్రుపట్ల సునీల్‌రెడ్డితో పాటు పలు ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలు, విద్యాసంస్థల్లో జెండా ఎగురవేశారు. అదేవిధంగా టీఆర్ఎస్. పలు పాఠశాలల విద్యార్థులు పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు.

ఇసుక తవ్వకాలు ఆపండి..

సుల్తానాబాద్: జిల్లాలోని మానేరు వాగు నుంచి పర్యావరణ అనుమతులు లేకుండా సాగుతున్న ఇసుక తవ్వకాలు నిలిపివేయాలని నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ (చెన్నై) ఆదేశించినట్లు బీజేపీ జిల్లా నాయకులు గొట్టిముక్కుల సురేష్ రెడ్డి, మానేరు పరిరక్షణ సమితి చైర్మన్ కరుణాకర్ రెడ్డి తెలిపారు. మానేరులో ఇసుక తవ్వకాలకు పర్యావరణ అనుమతులు లేవని సురేష్‌రెడ్డి, కరుణాకర్‌రెడ్డి నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్‌లో ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. ఈ మేరకు కలెక్టర్, భూగర్భ గనుల శాఖ, టీఎస్ఎండీసీ అధికారులకు ఉత్తర్వులు జారీ చేసిందని తెలిపారు. మానేరు విస్తీర్ణం, పొడవు, ఇప్పటివరకు తీసిన ఇసుక, మంజూరు చేసింది ఎంత..? అనే విషయాలను అఫిడవిట్ జత చేసి అందించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నట్లు పేర్కొన్నారు.

ఉత్తర్వులు అమలు చేయాలి

ఇసుక అక్రమ తవ్వకాలపై డిసెంబర్ 23న ఇచ్చిన ఆదేశాలను కొనసాగించాలని ఎన్‌జీటీ తాజా ఉత్తర్వుల్లో స్పష్టం చేసినట్లు సమాచారం. పర్యావరణ క్లియరెన్స్ లేనప్పుడు తవ్వకాలు జరపడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ.. తదుపరి ఉత్తర్వులు వచ్చేవరకూ గతంలో ఇచ్చిన స్టే కొనసాగుతుందని స్పష్టం చేసింది. ఉత్తర్వులు ఉల్లంఘిస్తే తీవ్రంగా పరిగణిస్తామని ఎన్‌జీటీ సభ్యులు జస్టిస్ పుష్పసత్యనారాయణ, డాక్టర్ సత్యగోపాల్ కొర్లపాటి ఉత్తర్వుల్లో పేర్కొన్నట్లు ఫిర్యాదుదారులు పేర్కొన్నారు.

కార్మిక క్షేత్రంలో గణతంత్ర వేడుకలు

గోదావరిఖని(రామగుండం): కార్మిక క్షేత్రంలో మువ్వన్నెల జెండా రెపరెపలాడింది. పలు కూడళ్లు, ఆఫీస్ కార్యాలయాలు, యూనియన్ కార్యాలయాల వద్ద జాతీయ జెండాలను ఎగురవేశారు. టీబీజీకేఎస్ కేంద్ర కార్యాలయంలో యూనియన్ ప్రధాన కార్యదర్శి మిర్యాల రాజిరెడ్డి, బీఎంఎస్ కార్యాలయం వద్ద యూనియన్ అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య, ఐఎన్‌టీయూసీ కార్యాలయంలో నాయకుడు ధర్మపురి, టీఎన్‌టీయూసీ కార్యాలయంలో సీనియర్ నాయకుడు అనుమ రాయమల్లు జెండా ఎగురవేశారు.

బాధ్యతతో లక్ష్యాలు సాధించాలి

- ఆర్జీ–2 జీఎం ఎ.మనోహర్

గోదావరిఖని(రామగుండం): సింగరేణీయులు బాధ్యతతో ముందుకు సాగి వార్షిక ఉత్పత్తి లక్ష్యాలు సాధించి సంస్థలోనే ఏరియాను నంబర్‌గా తీర్చిదిద్దాలని ఆర్జీ–2 జీఎం ఎ.మనోహర్ పేర్కొన్నారు. గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం యైటింక్లయిన్ కాలనీ అబ్దుల్‌కలాం స్టేడియంలో ఏర్పాటు చేసిన వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరై జాతీయ జెండా ఎగురవేశారు. సెక్యూరిటీ సిబ్బందిచే గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, బొగ్గు ఉత్పత్తి, నాణ్యత, రవాణాపై దృష్టి సారించి లక్ష్య సాధనపై దృష్టి పెట్టాలన్నారు. కంటిన్యూస్ మైనర్ ప్రవేశ పెట్టడం వల్ల వకీల్‌పల్లిగనిలో అత్యధిక బొగ్గు ఉత్పత్తి జరుగుతోందన్నారు. సమష్టి కృషి, ఇదే స్ఫూర్తితో ముందుకు సాగి వార్షిక లక్ష్యాల్లో అగ్రగామిగా ఏరియాను నిలపాలని కోరారు. కార్యక్రమంలో ఏరియా సేవా అధ్యక్షురాలు సవిత, ఉపాధ్యక్షుడు ఐలి శ్రీనివాస్, అధికారుల సంఘం అధ్యక్షుడు మోహన్‌రెడ్డి, ఎస్‌ఓటూ జీఎం సలీం తదితరులు పాల్గొన్నారు.


జెండా ఎగురవేస్తున్న ఆర్జీ–2 జీఎం మనోహర్

తెలంగాణకు మణిహారం సింగరేణి

- ఆర్జీ–3 జీఎం వెంకటేశ్వరరావు


జెండా ఆవిష్కరిస్తున్న జీఎం వెంకటేశ్వరరావు

రామగిరి(మంథని): రాష్ట్రంలోనే అతిపెద్ద పరిశ్రమగా, తెలంగాణకు మణిహారంగా సింగరేణి నిలుస్తుందని ఆర్జీ–3 జీఎం తన్నీరు వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. సెంటినరీకాలనీలోని రాణి రుద్రమాదేవి స్టేడియంలో గురువారం నిర్వహించిన గణతంత్ర వేడుకల్లో ముఖ్య అతిథిగా పాల్గొని త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం స్టేడియంలో నిర్వహించిన వేడుకల్లో గౌరవ వందనం స్వీకరించి మాట్లాడారు. రాష్ట్రంలో పెరుగుతున్న విద్యుత్ వినియోగానికి అనుగుణంగా బొగ్గును ఉత్పత్తి చేయడంతో పాటు సోలార్ పవర్ ఉత్పత్తి చేస్తున్నట్లు పేర్కొన్నారు. కార్మిక సంక్షేమ కోసం యాజమాన్యం అనేక కార్యక్రమాలు చేపట్టినట్లు వివరించారు. సంస్థ ప్రభావిత, పరిసర గ్రామాల ప్రజల ఆరోగ్య సంరక్షణకు మెడికల్ క్యాంపులు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. కార్మికులకు సంక్షేమ సదుపాయాలు అందించడంలో సింగరేణి మిగతా పరిశ్రమలకు ఆదర్శంగా నిలుస్తుందన్నారు. ఉత్తమ ఉద్యోగులను సన్మానించి జ్ఞాపికలు అందజేశారు. టీబీజీకేఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు గౌతం శంకరయ్య, ఏపీఏ ఇన్‌చార్జి జీఎం కొలిపాక నాగేశ్వర్ రావు, సేవా అధ్యక్షురాలు శ్రీదేవి, సంస్థ అధికారులు ఎలీషా, సీతారామం, శ్రీనివాసులు, రాధకృష్ణ, శ్రీనివాస్, నాగరాజు, విలాస్ శ్రీనివాస్ పోతేదార్, మారుతి తదితరులు పాల్గొన్నారు.

దేశ ఔన్నత్యాన్ని నలుదిశలా చాటాలి

- ఆర్జీ–1 జీఎం కె.నారాయణ


గౌరవ వందనం స్వీకరిస్తున్న జీఎం నారాయణ

గోదావరిఖని(రామగుండం): దేశ ఔన్నత్యాన్ని నలుదిశలా చాటేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని ఆర్జీ–1 జీఎం కె.నారాయణ కోరారు. గురువారం స్థానిక జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో జరిగిన గణతంత్ర దినోత్సవ వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. జాతీయ జెండా ఎగురవేసి గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, భారతీయులంతా ఐక్యమత్యంగా ఉండాలని, కుల, మత, జాతి బేధాలు లేకుండా ముందుకు సాగాలన్నారు. వార్షిక ఉత్పత్తి లక్ష్యాలను సాధించడానికి ప్రతీ ఉద్యోగి కష్టపడి రక్షణతో కూడిన ఉత్పత్తి సాధించి దేశ ప్రగతిలో మన వంతు కర్తవ్యాన్ని చాటుకోవాలన్నారు. కార్యక్రమంలో టీబీజీకేఎస్ ప్రధాన కార్యదర్శి మిర్యాల రాజిరెడ్డి, వర్కింగ్ ప్రసిడెంట్ కెంగర్ల మల్లయ్య. ఉపాధ్యక్షుడు గండ్ర దామోదర్‌రావు, సీఎంఓఏఐ అధ్యక్షుడు పానగోటి శ్రీనివాస్, పలు విభాగాల ఉన్నతాధికారులు చిలుక శ్రీనివాసు, బానోత్ సైదులు, చంద్రశేఖర్, రామకృష్ణ, మదన్‌మోహన్, నవీన్, లక్ష్మీనారాయణ, కిరణ్‌రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ కార్మికులకు సన్మానం

బొగ్గు ఉత్పత్తి లక్ష్యాల సాధనలో ముందుకు సాగుతున్న ఉత్తమ కార్మికులను గురువారం ఘనంగా సన్మానించారు. ఆర్జీ–1,2 ఏరియాల్లో జరిగిన వేర్వేరు గణతంత్ర వేడుకల్లో కార్మికులను సన్మానించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఆర్జీ–1 జీఎం కె.నారాయణ, ఆర్జీ–2 జీఎం ఎ.మనోహర్, అధికారులు పాల్గొన్నారు.

ఏఎల్పీలో తప్పిన పెను ప్రమాదం

రామగిరి(మంథని): సింగరేణి ఏపీఏ పరిధి అడ్రియాల లాంగ్ వాల్ ప్రాజెక్ట్(ఏఎల్పీ)లో గురువారం వేకువజామున పెను ప్రమాదం తప్పింది. గని ఆవరణలో సర్ఫేస్ చైర్ లిఫ్ట్ సమీపంలోని ఏ2 బెల్ట్ గ్యాలరీ షెడ్ ఒక్కసారిగా కూలిపోయింది. గ్యాలరీ షెడ్ కింది నుంచి నిత్యం వాహనాల రాకపోకలు సాగుతుంటాయి. అయితే గ్యాలరీ షెడ్ కూలిన సమయంలో ఎలాంటి వాహనాలు రాకపోడంతో పెను ప్రమాదం తప్పినట్లయ్యింది. షెడ్ ఒక్కసారిగా కుప్పకూడంతో బొగ్గు రవాణాకు అంతరాయం కలిగి పెద్దఎత్తున నష్టం వాటిల్లినట్లు కార్మికులు వాపోతున్నారు. బొగ్గు ఉత్పత్తిపైన ఉన్న శ్రద్ధ రక్షణపై చూపించకపోవడం వల్లే గనిలో తరుచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని, రక్షణ చర్యలు తీసుకోని సంబంధిత అధికారులపై యాజమాన్యం చర్యలు తీసుకోవాలని కార్మికులు, కార్మిక సంఘాల నాయకులు కోరుతున్నారు.


కూలిపోయిన గ్యాలరీ షెడ్

ఏఎల్పీలో కార్మికుడికి కరెంట్ షాక్

రామగిరి(మంథని): సింగరేణి ఏపీఏ పరిధి అడ్రియాల లాంగ్ వాల్ ప్రాజెక్ట్(ఏఎల్పీ)లో గురువారం వై.రామకృష్ణ అనే ఎలక్ట్రీషియన్ విదుత్‌షాక్‌కు గురయ్యాడు. స్థానిక కార్మికుల వివరాల ప్రకారం.. గనిలోని 89వ లెవల్‌లో స్విచ్ వద్ద విద్యుత్ కనెక్షన్ ఇస్తున్న సమయంలో ప్రమాదవశాత్తు షాక్ తగలడంతో రామకృష్ణ ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. గమనించిన తోటి కార్మికులు విద్యుత్ సరఫరా నిలిపివేసి రామకృష్ణను పరిశీలించగా అపస్మారక స్థితిలో ఉన్నాడు. హుటాహుటిన గనిపైకి తీసుకువచ్చి సెంటినరీకాలనీలోని సింగరేణి డిస్పెన్సరీకి తరలించారు. ప్రథమ చికిత్స పొందిన రామకృష్ణ స్పృహలోకి వచ్చాడు. అనంతరం మెరుగైన వైద్యం కోసం గోదావరిఖనిలోని సింగరేణి ఏరియా ఆస్పత్రికి తరలించారు. రామకృష్ణను టీబీజీకేఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు గౌతం శంకరయ్య, ఏఎల్పీ పిట్ సెక్రటరీ దాసరి మల్లేశ్ పరామర్శించారు.


రామకృష్ణను పరామర్శిస్తున్న నాయకులు